నేడు జాబ్‌డ్రైవ్

సనత్‌నగర్: సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని దిశ కార్యాలయంలో శనివారం జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఐవన్‌వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.10 గం నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.



ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సీపీజీఈటీ-2023 ప్రవేశాలలో భాగంగా ఆగస్టు 31న జరిగిన ఎంఏ జర్నలిజం, ఎమ్మెస్సీ డేటా సైన్స్ ప్రవేశ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 10 వరకు కొనసాగే మొదటి విడత పీజీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ర్యాంక్ కార్డులను సోమవారం ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.


తిమ్మిడి నాగరాజుకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ పాలన శాస్త్రం విద్యార్థి తిమ్మిడి నాగరాజుకు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.అమరేందర్ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రంలో మహిళల రాజకీయ సాధికారత, ప్రజాస్వామ్య భాగస్వామ్యం అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు.

అధ్యాపకుల అరెస్ట్ తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని నిజాం కాలేజీలో పెన్‌డౌన్ చాక్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా ఆందోళన చేస్తున్న మహిళలతో పాటు 50 మంది కాంట్రాక్టు అధ్యాపకుల అరెస్ట్ పై జేఏసీ నేత సీమర్ల విజేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడారు. 12 వర్సిటీలకు చెందిన 1045 మంది అధ్యాపకులు 150 రోజులుగా వివిధ రూపాలలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదన్నారు. నిజాం కాలేజీలో అధ్యాపకులను దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం తగదన్నారు. కాలయాపన చేయకుండా పర్మనెంట్ పై గతంలో అధ్యాపకులకు సీఎం రెండు సార్లు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. సత్యం, కిరణ్, అశోక్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు

కంటోన్మెంట్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లి లోని తన నివాసం వద్ద కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని 24 మంది షాదీముబారక్ చెక్కులను లాస్య నందిత, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని దేశంలో అత్యధిక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్, బోర్డు మాజీ సభ్యులు అనిత ప్రభాకర్, నళిని కిరణ్, లోకనాథం, శ్యామ్ కుమార్, నాయకులు టీఎస్ శ్రీనివాస్, పనస సంతోష్, సదానంద్ గౌడ్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని

కేటీఆర్‌కు శుభాకాంక్షలు

సనత్‌నగర్ : విదేశీ పర్యటన ముగించుకొని నగరానికి చేరుకున్న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకల్లో ..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో త్రీ స్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారంతో ముగిసాయి. ఈ వేడుకలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా వేడుకలను నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. బొగ్గుల కృష్ణ, చెన్నయ్యగౌడ్, అశ్విన్‌కుమార్, బాలాజీ, శేఖర్ తదితరులున్నారు.

అంజయ్యగౌడ్‌కు మంత్రి నివాళి

సనత్‌నగర్: అనారోగ్య సమస్యలతో గత కొంత కాలంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ నేత, తులసీనగర్ మాజీ అధ్యక్షుడు కప్పా అంజయ్యగౌడ్ గురువారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తులసీనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అంజయ్యగౌడ్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నర్సింగ్ కోర్సులో అడ్మిషన్లు

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ జిల్లాలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో జనరల్ నర్సింగ్ కోర్సులో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి ఒక ప్రకటనలో తెలిపారు. 2023-204 విద్యా సంవత్సరం కోసం ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవాలని రోస్టర్, రూల్స్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: సంగారెడ్డి జిల్లాలో ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రమేష్‌పై దాడి చేయడాన్ని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ(వి), ఆర్ఎస్ఏ కార్యకర్తలు ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

క్రీడా పోటీలు ప్రారంభం

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కంజర్ల శంకర్‌యాదవ్ స్మారక 20వ అంతర్ పాఠశాలల బాస్కెట్, వాలీబాల్ పోటీల శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. నగర వ్యాప్తంగా 16 పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

సనత్‌నగర్: బేగంపేట కట్టమైసమ్మ దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మీ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మయూరిమార్గ్, బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, మాతాజీనగర్, అల్లంతోటబావి ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల కాలనీల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలు

సనత్‌నగర్: నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలువురు ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ భావిభారత విద్యార్థులను ఉన్నతంగా మలచడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతగానో ఉంటుందని సమాజ వికాసంలో వారి పాత్ర కీలకమన్నారు. తోట మణిమాల, రమేష్, కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

లాలాపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తార్నాక డివిజన్ లాలాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థతో పాటు మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. ఈ సమస్యపై 'ఛిద్రమైన రహదారులు' అనే శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లోని మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టారు. సమస్యను పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి ఇందిరానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నేతికార్ మహేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పాడైన రోడ్లకూ మరమ్మతులు చేపట్టాలని కోరారు.

అశోక్‌కాలనీలో 'మేరీ మాటీ మేరా దేశ్'

సనత్‌నగర్: 'మేరీ మాటీ మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సనత్‌నగర్ అశోక్‌కాలనీలో డివిజన్ అధ్యక్షుడు కస్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రధాన మంత్రి వారి కుటుంబాల గౌరవార్థం ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మాణం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అందులో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హృషీకేశ్, దయానంద్, లక్ష్మీనారాయణ, నర్సింగరావు, శ్రీశైలంగౌడ్, చంద్రకుమార్, మహేష్ పాల్గొన్నారు.

ఈ-వేస్ట్‌తో అనర్థాలు

సీ-మెట్ డైరెక్టర్ డాక్టర్ రతీష్

సనత్‌నగర్: ఈ-వేస్ట్ ద్వారా ఉత్పన్నమయ్యే ప్రమాదకరమైన విష వాయువులు మానవాళి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సీ-మెట్) డైరెక్టర్ డాక్టర్ రతీష్ తెలిపారు. సనత్‌నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో శుక్రవారం ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రతీష్ మాట్లాడుతూ ఈ-వేస్ట్‌లో పాదరసం, లిథియం, ఇరిడియం, పల్లాడియం, గాలియం వంటి విష పదార్థాలు మిళితమై ఉంటాయని అయితే అసంఘటిత రంగంలోని కార్మికులు వీటిని సేకరించి ముక్కలుగా మార్చే క్రమంలో ఈ-వేస్ట్‌లోని ఆ విష పదార్థాలు పర్యావరణాన్ని దెబ్బ తీస్తున్నాయన్నారు. ఆదీకృత సంస్థలు, వ్యక్తుల ద్వారా మాత్రమే ఈ-వేస్ట్‌ను సేకరించి శాస్త్రీయ పద్ధతిలో రీ-సైక్లింగ్ చేయాలన్నారు. కొందరు ఈ-వేస్ట్‌ను కాలువలు, నదుల్లో పోయడంతో కూడా నీరు విషపూరితంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వర్క్‌షాప్‌లో రెల్డాన్ రిఫైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ రీ-సస్టేనబులిటీ డైరెక్టర్ హరీష్‌కుమార్, ఎర్త్ సైన్స్ రీసైకిల్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ బాలాజీ, సీనియర్ సోషల్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ జీరా హైదర్‌బస్తీలోని సంతోషిమాత దేవాలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దేవాలయంలో పూజా కార్యక్రమం సందర్భంగా దేవాలయం పరిసర ప్రాంతాలు భక్తులతో కోలాహలంగా మారాయి. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయం పండితులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మనోజ్‌కుమార్, సభ్యులు గణేష్, కుమార్ యాదవ్, అరుణ్ గౌడ్, ప్రేమ్‌కుమార్, కృష్ణంరాజు, అనుపమ, అంజన్‌లతో పాటు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ నుంచి బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు పోటీ తీవ్రంగా ఉంది. ఇప్పటికే 50 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం బీజేపీ ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ కపిల్ బరాబరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరేపల్లి పరుశరామ్ దరఖాస్తు చేశారు. కపిల్ బరాబరి బేగంపేట కేంద్రంగా పనిచేస్తున్న కెయిట్స్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థకు 15 ఏళ్లుగా సీఈఓగా పనిచేస్తున్నారు. బీజేపీ సోషల్ మీడియా విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2018లోనూ టికెట్ రేసులో నిలిచిన ఆయన స్థానికుడినైన తనకు ఈ సారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక బోర్డు మాజీ ఉద్యోగి పరుశరామ్ రాజకీయాల కోసమే ఉద్యోగాన్ని వదులుకున్నారు.



దరఖాస్తు చేస్తున్న కపిల్ బరాబరి

సికింద్రాబాద్/లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ కేటాయించాలని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి శారదా మల్లేష్ శుక్రవారం దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి తాము ఎంతో కృషి చేశామని ఈ సారి బీజేపీ టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తామన్నారు.

విమానం ఎక్కుతుండగా దాడి చేశాడంటూ ఫిర్యాదు

అమీర్‌పేట: విమానం ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి తనను కొట్టాడని బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ వివరాల ప్రకారం.. బిహార్ పాట్నా లాల్‌బహదూర్ శాస్త్రినగర్ పోస్టాఫీస్ రోడ్డుకు చెందిన మనీష్ మిశ్రా ఓ ఆర్గనైజేషన్ సంస్థ నడుపుతున్నాడు.పాట్నా నుంచి హైదరాబాద్ వచ్చేందుకు 6వ తేదీన జయప్రకాష్‌నారాయణ్ ఇంటర్‌నేషనల్ ఏయిర్ పోర్టుకు వెళ్లాడు. సెక్యూరిటీ చెక్‌లైన్‌లో వేచి ఉండగా గుర్తు తెలియని ఓ వ్యక్తి వెనకాల నుంచి వచ్చి మనీష్ ముందు నిల్చున్నాడు. ఇదేమని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి మనీష్‌ను కొట్టాడు. అప్పటికే విమానం బయలుదేరే సమయం కావడంతో నగరానికి చేరుకున్న మనీష్ అమీర్‌పేటలోని గ్రీన్ పార్కు హోటల్‌లో ఉండి స్థానికంగా ఉన్న వెల్‌నెస్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి పాట్నాలోని శాస్త్రీనగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యం

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో రూ.10 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాకే ఓట్లు అడుగుతామని చెప్పిన మాట నిలబెట్టుకున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్ అన్నారు. ఆరోవార్డు ఎల్ఐసీ కాలనీలో రూ.18 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శుక్రవారం బోర్డు సభ్యుడు రామకృష్ణతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కంటోన్మెంట్ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తాము పనులు చేపడుతున్నామన్నారు. సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ సహకారంతో త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతామన్నారు.


జనహృదయనేతకు
జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ సిహెచ్. నరసింహారెడ్డి గారు
శ్రీ చామకూర మల్లారెడ్డి గారు
కార్మిక ఉపాధి కల్పన & శిక్షణ నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రివర్యులు
జనహృదయనేత, ప్రజలమనిషి,
రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో
కీలక పాత్ర పోషిస్తున్న
మన రాష్ట్ర ప్రియతమ మంత్రి వర్యులు
శ్రీ చామకూర
మల్లారెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ సిహెచ్. గోపాల్ రెడ్డి గారు
CHAIRMAN,
CMR GROUP OF INSTITUTIONS
శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు
మల్కాజ్‌గిరి పార్లమెంట్,
కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకర్గ ఇంఛార్జ్